దోస, కర్బూజా రైతుల దిగాలు

- తెగుళ్లు, మంచు దెబ్బకు తగ్గిన దిగుబడి
- పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదంటున్న రైతులు
- అప్పులే మిగిలాయని ఆవేదన



తమ్మిశెట్టివారిపల్లిలో దిగుబడి లేని కర్బూజ పంటను చూపుతున్న రైతులు



బిసినివారిపల్లిలో సాగులో ఉన్న దోస పంట

తనకల్లు: దోస, కర్బూజను సాగు చేసిన రైతులు దిగుబడి లేకపోవడంతో దిగాలు చెందుతున్నారు. పంట కోసం పెట్టిన పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో అప్పులను ఎలా తీర్చాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. కదిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలలో 800 ఎకరాలకు పైగానే దోస, కర్బూజా పంటలను రైతులు తమ బోరు బావుల కింద సాగు చేశారు. దోస పంటను ఎకరాలో సాగు చేయడానికి రూ. లక్ష, కర్బూజా పంట కోసం రూ. 50 వేలు వరకు ఖర్చు చేశారు. అయితే ఆశించిన దిగుబడి లేకపోవడంతో పంట కోసం చేసిన అప్పులను ఎలా తీర్చాలని వారు వాపోతున్నారు.

దెబ్బతీసిన తెగుళ్లు

పంటలకు వివిధ రకాల వైరస్‌తో పాటు తెగుళ్లు సోకాయి. వీటికి వాతావరణ పరిస్థితులు తోడవడంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. కాయల పరిమాణం తక్కువగా ఉండడంతో పాటు నాణ్యత లేకపోవడంతో కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు. మొదట్లో అకాల వర్షాలు ఆ తరువాత మంచు ఎక్కువగా కురుస్తుడడం వల్ల పంట దిగుబడి తగ్గిపోయింది. సాధారణంగా దోస ఎకరాకు 12–15 టన్నులు, కర్బూజా ఎకరాకు 15–20 టన్నుల దిగుబడి వస్తుంది. అయితే ప్రస్తుతం ఎకరాకు 3 నుంచి 5 టన్నులు దిగుబడి కూడా వచ్చేలా లేదని రైతులు రమణ, చంద్రశేఖర్, వెంకటరమణ, రమణారెడ్డి తదితరులు పేర్కొంటున్నారు.

పెట్టుబడి దక్కేలా లేదు



నేను 4 ఎకరాల్లో దోస పంట సాగు చేశా. ఇందుకోసం రూ. 4.50 లక్షలు ఖర్చు వచ్చింది. అయితే తెగుళ్లు, మంచు వల్ల పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. పంట అమ్మితే రూ.2 లక్షలు కూడా వచ్చేది అనుమానమే. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

– ఫణికర్‌రెడ్డి, రైతు, బిసినివారిపల్లి, తనకల్లు

కర్బూజ నిలువునా ముంచింది



నేను రెండు ఎకరాల్లో అప్పు చేసి కర్బూజ సాగు చేశా. పెట్టుబడి రూ.లక్షకు పైగా అయ్యింది. 30 టన్నుల వరకు దిగబడి వస్తుందని ఆశించా. కానీ తెగుళ్లు, వైరస్ కారణంగా పంటలో దిగుబడి లేదు. 2 టన్నుల కాయలు కూడా ఉంటాయో లేదో. ప్రభుత్వం మా లాంటి రైతులను ఆదుకోవాలి.

– చంద్రశేఖర్, రైతు, తమ్మిశెట్టిపల్లి, తనకల్లు

దిగుబడిపై ప్రభావం



వాతావరణ మార్పులు దోస, కర్బూజ పంటల దిగుబడిపై ప్రభావం చూపాయి. తెగుళ్ల నివారణ కోసం రైతులకు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. గ్రామ సచివాలయాల్లోని వీహెచ్ఏలు పంట పొలాలను సందర్శిస్తున్నారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేస్తున్నాం.

– లావణ్య, హార్టికల్చర్ అధికారి తనకల్లు

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎంపికైన కార్యదర్శులు

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆ పార్టీ నాయకులకు సూచించారు. ఇటీవల పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పోలే వెంకటరెడ్డి, జిల్లా యాక్టివ్ కార్యదర్శిగా హనుమంతరెడ్డి, జిల్లా ఆర్గనైజేషనల్ కార్యదర్శులుగా మదుసూధన్‌నాయుడు , మాబు నియమితులైన విషయం తెలిసిందే. శనివారం వారు మాజీ ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మీపై నమ్మకం ఉంచి పార్టీ ఉన్నతమైన పదవులు కట్టబెట్టిందని, శక్తి వంచన లేకుండా పని చేయాలన్నారు. సర్పంచ్ తుమ్మల రంగారెడ్డి, నాయకులు లక్ష్మిరెడ్డి, సూర్యనారాయణ, నరశింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



ధర్మవరంలో హెల్మెట్ ధరించి బైకు ర్యాలీ చేస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్, సీఐలు

ధర్మవరం అర్బన్: ద్విచక్రవాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని డీఎస్పీ హేమంత్‌కుమార్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా శనివారం పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి డీఎస్పీ హేమంత్‌కుమార్‌తో పాటు వన్‌టౌన్, టూ టౌన్, రామగిరి సీఐలు నాగేంద్రప్రసాద్, శ్రీధర్ హెల్మెట్‌లు ధరించి బైకు ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ప్రాణహాని ఉండదని తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు కట్టడి చేయాలని తెలిపారు. ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బత్తలపల్లి: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని ఎస్ఐ సోమశేఖర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని కూడలిలో జాతీయ రహదారి భద్రతా మహోత్సవంలో భాగంగా హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి పురవీధుల్లో హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ చేపట్టారు. ఎస్ఐ సోమశేఖర్, ఎంపీడీఓ నరసింహనాయుడు మాట్లాడుతూ హెల్మెట్ వినియోగించడం ద్వారా ప్రమాద సమయంలో ద్విచక్రవాహనదారులు తమ ప్రాణాలను కాపాడుకోవచ్చునన్నారు. ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయ, పోలీస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాకు మెమో



మాట్లాడుతున్న సీడీపీఓ రాధిక

ఎన్పీకుంట: పి.కొత్తపల్లి అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలకు సీడీపీఓ రాధిక మెమో జారీ చేశారు. శనివారం అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయా, కార్యకర్త ఇద్దరూ గొడవ పడ్డారనే విషయం తెలుసుకొని, గొడవకు గల కారణంపై ఆరా తీశారు. అనంతరం ఇరువురికి మెమోలు జారీ చేసి, రెండు రోజులలో రాత పూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఆయా గత కొంత కాలంగా దగ్గు, ఆయాసంతో విధులు నిర్వహిస్తోందని, దీంతో తమ పిల్లలను సెంటర్‌కు పంపించడం లేదని గ్రామస్తులు సీడీపీఓకు ఫిర్యాదు చేశారు. స్పందించిన సీడీపీఓ సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించుకొని నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సూపర్‌వైజర్ నరసమ్మ ఉన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

ధర్మవరం అర్బన్ : అడవులను సంరక్షించడం అందరి బాధ్యత అని ఆర్డీఓ మహేష్ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శనివారం ప్రొటెక్షన్ ఆఫ్ ఫారెస్ట్ ల్యాండ్స్ యాక్ట్‌కు సంబంధించి సమావేశం నిర్వహించారు. అడవికి నిప్పు మానవాళికి ముప్పు అనే పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ అటవీ భూముల ఆక్రమణలు అరికట్టాలన్నారు. అడవికి నిప్పు పెట్టేవారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. పెనుకొండ, బుక్కపట్నం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు శ్రీనివాసులురెడ్డి, యామిని సరస్వతి, అటవీశాఖ అధికారులు, తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమావేశం అవుతారని పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

వ్యాక్సిన్‌తో వ్యాధి నిరోధక శక్తి

ఎన్పీకుంట: వ్యాక్సిన్‌తో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సీహెచ్ఓ నాగలక్ష్మి పేర్కొన్నారు. శనివారం బందారుచెట్ల పల్లి సమీపంలో గుడారాలు వేసుకొని నివసిస్తున్న సంచార జాతుల వారికి వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా వారికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ మహేశ్వరరెడ్డి, ఆరోగ్యకార్యకర్త రమేష్‌రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ భార్గవి పాల్గొన్నారు.

నట్టల నివారణతో జీవాల్లో రోగనిరోధక శక్తి

బత్తలపల్లి: నట్టల నివారణ టీకాలతో జీవాల్లో రోగనిరోధకశక్తి పెరుగుతుందని బత్తలపల్లి ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 1,580 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించారు.

డీలర్ల సంఘం మండలాధ్యక్షుడిగా గోపాల్

అమడగూరు: డీలర్ల సంఘం మండలాధ్యక్షుడిగా కుంచె గోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం అమడగూరులో డీలర్ల సంఘం నూతన కమిటీ ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా గోపాల్, ఉపాధ్యక్షుడిగా పెద్దక భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా రెడ్డెప్ప, కార్యదర్శిగా నిర్మల ఎన్నికయ్యారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

చెన్నేకొత్తపల్లి: ప్రతి మహిళ వారికి ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహిళా న్యాయవాదులు సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ధర్మవరానికి చెందిన మహిళా న్యాయవాదులు బాలాసుందరి, భార్గవి మాట్లాడుతూ మహిళలకు అన్యాయం జరిగిన వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.కార్యక్రమంలో సీడీపీఓ కవితదేవి, వెలుగు ఏపీఎం నాగేంద్ర, ఈఓఆర్డీ అశోక్ కుమార్‌నాయక్, టింబక్టు కలెక్టివ్ సంస్థ రమీజా పాల్గొన్నారు.

మసీదు స్థలానికి పట్టా మంజూరు చేయండి

గాండ్లపెంట: కటకంవారిపల్లిలో మసీదు స్థలానికి పట్టా మంజూరు చేయాలని గ్రామస్తులు శనివారం తహసీల్దార్ బాబు రావుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన 20 ఏళ్లకుపైగా గ్రామానికి చెందిన ప్రభుత్వ స్థలంలో మసీదు నిర్మించుకున్నారన్నారు. మసీదుకు పట్టా మంజూరు చేయాలని కోరారు. ముస్లింలు ముస్తఫా, మాబుసాబ్, సలావుద్దీన్, ఖాదర్‌బాషా, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

ఓటు హక్కుతో భవిష్యత్తు నిర్మించుకోండి





సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న ఆర్డీఓ మహేష్, ఇతర అధికారులు , నల్లచెరువులో విద్యార్థుల మానవహారం

ధర్మవరం అర్బన్: ఓటు హక్కు దేశ భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆర్డీఓ మహేష్ పేర్కొన్నారు. పట్టణంలోని శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో కలిసి ఆర్డీఓ పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. అనంతరం కాలేజి సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ సిటిజన్లు నరసమ్మ, రామలక్ష్మమ్మ, పుల్లన్న, దివ్యాంగులు మల్లికార్జున, పార్వతమ్మ, ఊర్మిళను ఆర్డీఓ శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. నూతన ఓటర్లకు ఓటర్‌కార్డులను అందించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు నటరాజ్, భాస్కర్‌రెడ్డి, నారాయణస్వామి, స్వర్ణలత, ఎన్నికల డీటీ ఈశ్వరయ్య, సీనియర్ అసిస్టెంట్ రాఘవరెడ్డి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు గోపాల్‌నాయక్, చిట్టెమ్మ, షమీవుల్లా, త్రివేణి, కిరణ్‌కుమార్, పావని, భువనేశ్వరి, పుష్పావతి, సరస్వతి, ఆనంద్, మీనా పాల్గొన్నారు.

కదిరి అర్బన్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్‌బాలికల ఉన్నత పాఠశాలలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓతో పాటు మున్సిపల్‌కమీషనర్ కిరణ్, తహసీల్దార్ మురళీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రాజ్యాంగంలోని 344 అధికరణం 18 ఏళ్లు నిండిని ప్రతి ఒక్కరికీ ఓటు కల్పించిందన్నారు. అనంతరం సీనియర్ ఓటర్లను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కొత్త వారికి ఓటరు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణ సిఐ నారాయణరెడ్డి, ఎంఈఓ చెన్నక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల కేంద్రంలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. తహసీల్దార్ బాబు రావు సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. ఎంఈఓ క్రిష్ణానాయక్, ఆర్ఐ అశోక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అమడగూరు: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో శనివారం రెవెన్యూ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ రామనాథరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి: బుక్కపట్నంలో శనివారం అధికారులు, విద్యార్థులు జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ షాబుద్దీన్, ఎంపీడీఓ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్పీకుంట: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ దేవేంద్రనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువు: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకూ విద్యార్థులు, రెవెన్యూ అధికారులు ర్యాలీ చేపట్టారు. తహసీల్దార్ రవికుమార్, ఎంఈఓ చెన్నకేశవులు, హెచ్ఎం విజయలక్ష్మి, ఎస్ఐ మక్బూల్ బాషా పాల్గొన్నారు.

క్లుప్తంగా

గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు



ధర్మవరం: ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి శనివారం గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలోని ప్రజలంతా గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకోవాలని సూచించారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

ధర్మవరం రూరల్: చిత్రావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం పోతులనాగేపల్లిలో గ్రామ సభను నిర్వహించారు. డీఎస్పీ హేమంత్‌కుమార్, రూరల్ సీఐ ప్రభాకర్ మాట్లాడుతూ చిత్రావతి నది నది నుంచి ఇసుకను ఎవరైనా తరలిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

దిగుబడి అంచనా కోసమే పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది పంటలో దిగుబడి అంచనా కోసమే పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ పేర్కొన్నారు. శనివారం ఈదుల ముష్టూరు గ్రామంలోని 451–4 సర్వే నంబర్‌లో వెంకటరత్నం సాగు చేసిన కంది పంటలో ఏఓ ఓబిరెడ్డి, ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ పర్యవేక్షణలో వీహెచ్ఏ సత్యనారాయణ పంటకోత ప్రయోగాలను నిర్వహించారు. ఏఈఓ శ్రీనివాసులు, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కోఆర్డినేటర్లు మంజునాథ్, రైతులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ



ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు అందిస్తున్న సంస్థ నిర్వాహకులు

ధర్మవరం అర్బన్ : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శనివారం పరమపిత వెంకటరమణాచార్య గురువు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వామి ఆరాధనోత్సవంలో భాగంగా రోగులు, వారి సహాయకులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవి, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు యోగిముక్తేశ్వరి మాతాజీ, మోక్షిముక్తేశ్వరి మాతాజీ, బీజేపీ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు హాజరయ్యారు.

డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీవద్దనున్న మధు కంటి వైద్యశాలలో శనివారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు వాహనాల డ్రైవర్లకు కంటి వైద్యాధికారి నరసింహులు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేశారు. రోడ్డు ప్రమాదాలు తగ్గాలంటే ముఖ్యంగా డ్రైవర్లకు కంటిచూపు బాగా ఉండాలని తెలిపారు. వచ్చే నెల 15 వరకు వాహనాల డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు చేస్తామన్నారు.

ముగ్గురికి తీవ్రగాయాలు

కదిరి అర్బన్: రాచువారిపల్లితండా సమీపంలోని మద్దిలేరు వద్ద శనివారం ఆటోను టిప్పర్ ఢీ కొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..నల్లమాడ మండలం రెడ్డికుంటతండాకు చెందిన మునెమ్మ, చక్రిబాయ్, కవిత కూలిపనుల నిమిత్తం కదిరి మండలం రాచువారిపల్లితండాకు వచ్చారు. పని ముగించుకుని స్వగ్రామానికి ఆటోలో బయలుదేరారు. మద్దిలేరు వద్ద ఎదురుగా వచ్చిన టిప్పర్ ఆటోను ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించండి

ప్రశాంతి నిలయం: కొత్తచెరువు మండలం తలమర్లకు చెందిన సాహితీవేత్త కళానిధి (కొల్లప్ప) విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని తలమర్ల గ్రామస్తులు శనివారం పంచాయతీ కార్యదర్శి గోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సామాజిక కార్యకర్త మారుతి రెడ్డి, రిటైర్డ్ హెచ్ఎంలు సుబ్బరాయుడు ,గోపాల్‌రెడ్డి, నాగేంద్ర, చిన్నయ్య పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



హరియాన్‌చెరువు గ్రామంలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వైద్య సిబ్బంది సూచించారు. మండల పరిధిలోని హరియాన్‌చెరువు గ్రామంలో శనివారం ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ, 104 సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గర్భవతులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ పద్మావతి, హెచ్ఏ వెంకటేష్, ఎంఎల్‌హెచ్‌పీ రూన్నీ, ఏఎన్ఎం అశ్విని,104 సిబ్బంది, సాయి గణేష్, ఆశావర్కర్ మీనాక్షి పాల్గొన్నారు.

పరామర్శ



ముత్యాలప్పను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్

అనంతపురం కార్పొరేషన్: అనారోగ్యంతో ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న రామగిరి మండలం నసనకోట గ్రామానికి చెందిన బోయ ముత్యాలప్పను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ శనివారం పరామర్శించారు. బోయ ముత్యాలప్పకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం బోయ ముత్యాలప్పకు ఆర్థికసాయం చేశారు. అదేవిధంగా కనగానపల్లి మండలం సోమరవండ్లపల్లి గ్రామానికి చెందిన పాము కాటుకు గురైన జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కురుబ చిట్ర రవిని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బెడుదురు గోపాల్ రెడ్డి, చియ్యేడు సర్పంచ్ గంగాధర్ రెడ్డి, పూలకుంట శివారెడ్డి, కుంటిమద్ది రమేష్, అక్కంపల్లి నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ధర్మవరం: విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ మీటర్ రీడర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాన్వాజ్, కోశాధికారి దస్తగిరి, వినోద్, నరేష్, బాబా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పుట్టపర్తిలోని ఎస్ఈ కార్యాలయంలో శనివారం ఎస్ఈ సురేంద్ర చేతులమీదుగా అసోసియేషన్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు, మీటర్ రీడర్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రీచార్జ్ మీటర్లు వస్తున్న నేపథ్యంలో మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోయే అవకాశముందన్నారు. మీటర్ రీడర్లకు సంస్థలో ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరారు.

కేసు నమోదు

కదిరి టౌన్: వ్యక్తిపై దాడి ఘటనలో పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వివరాలు...మున్సిపల్ పరిధిలోని మూర్తిపల్లికి చెందిన ఎలికే శ్రీరాములు ఆటో డ్రైవర్‌గా పని చేసేవాడు. శనివారం రాత్రి ఇంటికి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన రమేష్, గంగాధర్, వెంకటేష్ కాటం వైన్‌షాపు వద్ద మద్యం సేవించి శ్రీరాములుతో గొడవపడి రాళ్లతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

గొర్రెల పెంపకందారుల సంఘం ఎన్నికలు

ధర్మవరం రూరల్: పోతుకుంటలో గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలు శనివారం సజావుగా జరిగాయి. అధ్యక్షుడిగా రామాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా నారాయణస్వామి, డైరెక్టర్లు మరో ఏడుగురు ఎన్నికైనట్లు పశువైద్యాధికారి శేఖర్ తెలిపారు. ఎన్నికల అధికారులుగా డాక్టర్ రమాదేవి, డాక్టర్ స్వర్ణలత వ్యవహరించారు.

ముదిగుబ్బ: ముదిగుబ్బలో శనివారం గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలు సజావుగా జరిగాయి. అధ్యక్షుడిగా కృష్ణమూర్తి యాదవ్, వైస్ ప్రెసిడెంట్‌గా లక్ష్మీనారాయణతోపాటు మరో ఏడుగురు డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా డాక్టర్ మల్లికార్జున వ్యవహరించారు.